నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | NIZAMABAD

## నిజామాబాద్‌లోనూ భూగర్భ జలాలు తగ్గుముఖం..

నిజామాబాద్ జిల్లాలోనూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. బోరు బావుల నుంచి చుక్కా నీరురావడం లేదు. పొలాలకు నీరు తడిపేందుకు రైతు నానా కష్టా లు పడాల్సిన దుస్థితి. యాసంగిలో జిల్లాలో 5లక్షల 46వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ఇందులో 4లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 96వేల వ్యవసాయ బోరు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో సగటు నీటి మట్టం 10.09 మీటర్లకు పడిపోయింది. ఇందల్వాయి, డిచ్‌పల్లి, భీంగల్, మోపాల్, నిజామాబాద్ సౌత్, నిజామాబాద్ నార్త్, చందూర్, రుద్రూర్ మండలాల్లో నీటి కొరతతో రైతులు దిగాలు చెందుతున్నారు. 10 మీటర్ల నుంచి 15మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. యాసంగి సాగు ప్రారంభం నుంచే కకావికలమవుతున్న రైతుకు భూగర్భ జలాలు లేకపోవడంతో పంటను కాపాడుకోలేక చతికిల పడుతున్నారు. ఎండుతున్న వరి పంటతో నష్టాలను మూటగట్టుకుంటున్నాడు. నష్టాల బారిన పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

### అమరవీరులకు నివాళి




జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత జవాన్లకు ఉమ్మడి జిల్లాలో పలు సంఘాలు, యువకులు, విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఎక్స్ పారామిలిటరీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లింబేష్ నాయక్ ఆధ్వర్యంలో యువకులు క్యాండిల్ ర్యాలీ చేపట్టి, అమరవీరులకు నివాళులర్పించారు. –ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 14

# పాతాళంలోకి గంగమ్మ


## అడుగంటుతున్న జలాలు

- ఎండుతున్న పంటలు.. చేజారుతున్న ఆశలు
- ముందుచూపులేని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో దుర్భర పరిస్థితి
- రైతులను అప్రమత్తం చేయడంలో సర్కారు వైఫల్యం



పదేండ్లు వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్న రైతులు..ఏడాది కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాసంగి సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం రాక, మరోవైపు సాగునీరు అందక ఆగమాగమవుతున్నారు. పంట చేతికి రాకుండా పోతుండడంతో పరేషానవుతున్నరు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో కర్షకులకు సాగుకు నీటి కష్టాలు చుట్టుముడుతున్నాయి. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా రైతు కుదేలవుతున్నాడు. సాగునీటి కటకటతో అల్లాడుతున్నాడు. నెర్రెలు బారిన పొలాలను చూసుకుంటూ గుండెలు బాదుకుంటున్నాడు. భూగర్భ జలాలు అడుగంటుతుండడం ఆందోళనకు గురిచేస్తున్నది. ఇంతటి దుర్భర పరిస్థితులు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో నెలకొనడం గమనార్హం.

–నిజామాబాద్, ఫిబ్రవరి 14
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)



కులాస్‌పూర్‌లోని ఓ పొలంలో సన్నటిధారగా పోస్తున్న బోరు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 'సాగు' సవ్యంగా సాగింది. ఎటు చూసినా పచ్చదనం పరిచినంతగా పచ్చని పొలాలు కనిపించేవి. జల తరంగాల మధ్య రైతులు జోరుగా పంటలు సాగు చేసేది. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగామారింది. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు ముందు చూపు లేకపోవడంతో రైతన్నకు ఇబ్బందులు తప్పడంలేదు. యాసంగికి నీటి కటకట ఎదురవుతుందని తెలిసినప్పటికీ రైతులను చైతన్య పర్చడంలో సర్కారు విఫలమైంది. దీంతో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన వారికి చేతికి పంట డబ్బులైనా వస్తాయో? రావో? అనే ఆందోళన వెంటాడుతున్నది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇంతవరకు రైతు భరోసా పథకమే అమలు కాలేదు. యాసంగి నుంచి పెట్టుబడి సాయం వేస్తామని సర్కారు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకూ డబ్బుల జమ సరిగా కావడం లేదు. ఓ వైపు పెట్టుబడి సాయం రాక, మరోవైపు అప్పులు తీసుకు వచ్చి సాగుచేస్తున్న పంట కళ్లెదుటే ఎండిపోతుంటే రైతులు అల్లాడిపోతున్నారు.

### కామారెడ్డిలో ప్రమాద ఘంటికలు..

యాసంగిలో వరి పైరు ఇప్పుడేకంగా పొట్ట దశకు చేరుకుంటున్నది. నెల రోజులైతే బాన్సువాడ ప్రాంతంలో కోతలు కూడా షురూ అయ్యే అవకాశం ఉన్నది. ఈ పరిస్థితిలో భూములకు తడి లేక పంటలు ఎండి పోతున్నాయి. కామారెడ్డి జిల్లాలో ఈ పరిస్థితి చాలా అధ్వానంగా మారింది. వేసవి మొదలవ్వక ముందే ఈ దుస్థితి కనిపిస్తుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది. జనవరి నెలాఖరుకు భూగర్భ జల వనరుల శాఖ సేకరించిన లెక్క ల మేరకు జిల్లా సగటు నీటి మట్టం 10.95 మీటర్ల లోతుకు చేరింది. యాసంగిలో కామారెడ్డి జిల్లా వ్యాప్తం గా 3లక్షల 85వేల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, 2లక్షల 61వేల ఎకరాల్లో వరిని సాగు చేశారు. 1.80 లక్షల ఎకరాల్లో వరి పంటను బోరు బావుల కింద సాగు చేశారు. ఎన్పీడీసీఎల్ గణాంకాల మేరకు జిల్లాలో లక్షా 10వేల బోర్లు ఉన్నాయి. భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుతుండడం అన్నదాతలకు ఆందోళనకు గురిచేస్తున్నది. పిట్లం మండలం గోజెగావ్‌లో ప్రమాదకరంగా 30మీటర్ల లోతుకు భూగర్భ జలాలు అడుగంటాయి. భిక్కనూర్, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, గాంధారి, రాజంపేట మండలాల్లోనూ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గాంధారి మండలం గుర్జాల్‌లో 21.8మీటర్లు, రాజంపేట మండలం సిద్ధాపూర్‌లో 13.75మీటర్లు, భిక్కనూర్ మండలం మల్లుపల్లిలో 20.19మీటర్లు, తాడ్వాయి మండలం అన్నారంలో 15.78మీటర్లు, కామారెడ్డి శివారు అడ్లూర్‌లో 15.40మీటర్లలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు రోజురోజుకూ ఎండలు తీవ్రం అవుతున్నాయి. వరి పంట ప్రస్తుతం కీలక దశకు చేరింది. ఈ పరిస్థితిలో పంటలకు నీరు అత్యవసరం. పొట్ట కు వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు అప్పు చేసి ట్యాంకర్ల ద్వారా నీళ్లను అందిస్తున్నారు. రైతుల దీనవస్థను చూసి ప్రభుత్వం మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు.



### నీరు లేక పంట ఎండుతున్నది

యాసంగి సాగు ప్రారంభంలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయనే ధైర్యంతో ముందడుగు వేసిన. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం రాకపోయినప్పటికీ సొంత పైసలతో పంటసాగుపై పెట్టుబడి పెట్టిన. బోరు ఎత్తి పోతుండడంతో నీరు లేక పంట ఎండుతున్నది. నాకేం దిక్కుతోచడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- నారాయణ, కులాస్‌పూర్, మోపాల్ మండలం

# బాలిక కిడ్నాప్ కలకలం

- నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేసిన యువకులు
- బాన్సువాడ పోలీసులకు అప్పగింత



మొండిసడక్ వద్ద యువకుడికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 14 : బాన్సువాడ మండలంలో ఓ గురుకుల విద్యార్థిని కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. కొందరు యువకుల చొరవతో సదరు బాలిక ప్రమాదం నుంచి బయటపడింది. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి విద్యార్థిని, యువకులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తండ్రి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని చెప్పి వరసకు అన్న అయ్యే ఓ యువకుడు బాన్సువాడ గురుకులం నుంచి ఓ విద్యార్థినిని బైక్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్లకుండా మొండిసడాక్ వైపు వెళ్లాడు. మార్గమధ్యంలో పెట్రోల్ అయిపోవడంతో బైక్‌ను అక్కడే వదిలేసి, లిఫ్ట్ అడిగి మరో బైక్‌పై ఇద్దరూ మొండిసడాక్ వరకు వెళ్లారు. పెట్రోల్ కోసం సదరు యువకుడు ఇతరుల వద్ద డబ్బులు అడుగుతుండగా.. అనుమానం వచ్చిన విద్యార్థిని ఓ యువకుడి ఫోన్ ద్వారా ఇంటికి ఫోన్‌చేసి, జరిగిన విషయం తన తల్లికి వివరించింది. వెంటనే విద్యార్థిని తల్లి ఫోన్ ఇచ్చిన వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతూ అమ్మాయిని కాపాడాలని కోరింది. దీంతో సదరు వ్యక్తి అక్కడున్నవారికి విషయం చెప్పి విద్యార్థినిని బైక్‌పై తీసుకువచ్చిన యువకుడిని నిలదీయడంతో వారిపై దాడికి దిగాడు. దీంతో అతడిని వారు తాడుతో బంధించి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ సీఐ మండల అశోక్ అక్కడికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకొని బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి గురుకుల పాఠశాల తరగతి గది నుంచి బాలికను తీసుకెళ్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాల నుంచి బాలికను బయటికి తీసుకెళ్లి రెండు గంటలు గడిచినప్పటికీ ప్రిన్సిపాల్ లేదా సిబ్బందిగాని తల్లిదండ్రులకు లేకుంటే పోలీసులకు సమచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అదుపులోకి తీసుకున్న యువకుడి వద్ద కటింగ్ ప్లెయర్, స్క్రూ డ్రైవర్, ఇనుప వైరు లభించాయి. విద్యార్థిని తల్లికి ఫోనులో సమాచారం ఇవ్వకుంటే ఆమె పరిస్థితి ఎలా ఉండేదోనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సీఐ అశోక్ మాట్లాడుతూ యువకుడు మతిస్థిమితం కోల్పోయాడని, వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించినట్లు తెలిపారు. సదరు యువకుడిపై ప్రిన్సిపాల్ రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# గుర్తుపట్టేదెలా?

ప్రజలకు సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండాలి. అవి ఎక్కడ ఉన్నా ప్రజలకు తెలిసేలా వాటికి సంబంధించిన పేర్లతో బోర్డులను ఏర్పాటుచేయాలి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి కార్యాలయాలను త్వరగా గుర్తుపట్టడానికి అవకాశం ఉంటుంది. కానీ నిజామాబాద్ రూరల్ తహసీల్ ఆఫీస్ ఎక్కడ ఉందో ఇప్పటికీ చాలా మంది రైతులు, ప్రజలకు తెలియదు. ఆర్మూర్ వైపు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఓ రెండంతస్తుల భవనంలో రూరల్ తహసీల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ బయట ఎలాంటి బోర్డూ ఏర్పాటు చేయకపోవడంతో పనుల కోసం వచ్చే రైతులు, ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. తీరా ఆ భవనం వద్దకు వెళ్లి దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్




## లంచం కేసులో జీపీ కార్యదర్శికి
# ఏడాది కఠిన జైలు శిక్ష

- రూ.40వేలు జరిమానా
- తీర్పు వెలువరించిన నాంపల్లి ఏసీబీ కోర్టు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 14: లంచం తీసుకున్న కేసులో గ్రామ పంచాయతీ కార్యదర్శికి నాంపల్లి అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం ఏడాది జైలుశిక్ష , రూ.40వేల జరిమానా విధించినట్లు నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన వడ్డె నర్సింహులు తన తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తమ సోదరుల పేరు మీదకు మార్చాలని పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. పని పూర్తిచేయడానికి పంచాయతీ కార్యదర్శి జి.సుదర్శన్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో నర్సింహులు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. 2014 ఫిబ్రవరి 21న నర్సింహులు నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటుండగా కార్యదర్శి సుదర్శన్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేయగా.. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శుక్రవారం వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్.. కార్యదర్శి సుదర్శన్‌కు ఏడాది కఠిన జైలు శిక్షతో పాటు రూ.20వేలు జరిమానా, మరో కేసులో రూ.40వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

## కోట్లతో నిర్మించారు..
# వృథాగా వదిలేశారు..

- పశువులకు ఆవాసంగా ఆధునిక గోదాం
- గత ప్రభుత్వ హయాంలో రూ.3 కోట్లతో నిర్మాణం
- అగ్నిప్రమాద ఘటనతో పట్టించుకోని అధికారులు



గోదాం ఆవరణలో మద్యం సీసాలు, గ్లాసులు



ఎల్లారం గ్రామ రహదారి వద్ద నిర్మించిన గోదాం

లింగంపేట, ఫిబ్రవరి 14: రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి నిర్మించిన గోదాం వృథాగా మారింది. వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆధునిక గోదాం.. పశువులకు ఆవాసంగా మారగా.. మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం (2019–20)లో మండలంలోని ఎల్లారం గ్రామ రహదారి పక్కన నాబార్డు ఆర్థిక సాయం రూ.మూడు కోట్లతో ఐదువేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాంను నిర్మించారు. వానకాలం, యాసంగిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అధికారులు గన్నీ బ్యాగులను గోదాంలో నిల్వ ఉంచారు. గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో గన్నీ బ్యాగులు కాలిబూడిదయ్యాయి. మంటలను ఆర్పివేయడానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చిన సమయంలో అధికారులు షట్టర్లను తొలగించారు. తిరిగి వాటిని బిగించకపోవడంతో గోదాం అప్పటి నుంచి పశువులకు ఆవాసంలా మారింది. సమీప గ్రామాల్లోని కొందరు రైతులు తమ పశువులు, గొర్రెలు, మేకలను రాత్రి పూట గోదాంలో ఉంచడంతో దుర్గంధం వ్యాపిస్తున్నది. కామారెడ్డి, ఎల్లారెడ్డి రహదారికి అతి సమీపంలో గోదాం ఉండడంతో వాహనదారులు మద్యం తాగుతుండగా..అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కాపలా కోసం సెక్యూరిటీ గార్డు కోసం నిర్మించిన గది వృథాగా మారింది. రైతుల సౌలభ్యం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గోదామును వృథాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని మండలవాసులు కోరుతున్నారు.



గోదాం లోపల మేకలు, గొర్రెల మల మూత్రాలు, ధ్వంసమైన షట్టర్

# వర్గీకరణను నిరసిస్తూ మాలల ఆందోళన

## బోధన్‌లో షమీమ్ అక్తర్ నివేదిక ప్రతుల దహనం

బోధన్, ఫిబ్రవరి 14: బోధన్ పట్టణంలో హరిజన సుధార్ సమితి మాల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి మాట్లాడుతూ.. నమ్ముకున్న మాలలను కాంగ్రెస్ పార్టీ నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఆ పార్టీని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బొంద పెట్టడం ఖాయమన్నారు. 2011 జనాభా లెక్కల్లో ఉపకులాల గణన జరగలేదని, తప్పుడు జనాభా లెక్కలతో వర్గీకరణ చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లు గడిచిన తర్వాత కూడా పాత జనాభా లెక్కలను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా మాలలకు అన్యాయంచేశారని, ఇకనైనా మాలలు కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి రావాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు బోధన్ డివిజన్ ఉపాధ్యక్షుడు కారం స్వామి, హరిజన సుధార్ సమితి మాల సంఘం అధ్యక్షుడు పెరక స్వామి, మాల నాయకులు పల్లాటి యాదగిరి, నీరడి అశోక్, బాలకృష్ణ, మల్లేశం, కాపర్ల స్వామి, శ్రీనివాస్, పల్లాటి లక్ష్మణ్, కేశవ్, లింగాలరాజు తదితరులు పాల్గొన్నారు.



బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లో నివేదిక ప్రతులను దహనం చేస్తున్న హరిజన సుధార్ సమితి మాల సంఘం నాయకులు